క్లుప్తంగా

జోరుగా తాటి ముంజల అమ్మకాలు



కలెక్టరేట్ వద్ద తాటి ముంజలు అమ్ముతున్న కార్మికులు

సంగారెడ్డి టౌన్: ప్రకృతి ప్రసాదం తాటి ముంజలు. ప్రతి ఏడాది మార్చి నుంచి మే చివరివరకు తాటి ముంజల కోసం జనాలు గీత కార్మికుల చుట్టూ పరుగులు పెడుతుంటారు. పట్టణాల్లో రోడ్లకు ఇరువైపులా దర్శనమిస్తున్నాయి. రూ.100లకు డజను ముంజలు అమ్ముతున్నారు. వేసవిలో వీటితో ఉపాధి పొందుతున్నామని గీత కార్మికులు చెబుతున్నారు. తాటి ముంజలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు కూడా సూచిస్తున్నారు.

ప్రజా ఉద్యమాలు నిర్మిస్తాం



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నారాయణఖేడ్: పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం ఖేడ్ ఏరియా కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజా సమీకరణలు చేసి ప్రజలను చైతన్యం చేయడమే ఆయనకు అందించే ఘన నివాళి అని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు సంతోష్, రవి, ఏసు, మోహన్, కాన్షీరాం ఉన్నారు.

సుందరయ్యకు నివాళి

జహీరాబాద్ టౌన్: కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి పురస్కరించుకుని సీపీఎం నాయకులు పట్టణంలోని శ్రామిక్ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రాంచందర్ మాట్లాడుతూ.. భూస్వామి కుటుంబంలో పుట్టిన ఆయన వందల ఎకరాలను పేదలకు పంచారని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచినప్పుడే సుందరయ్య కన్న కలలు సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రన్న, తుల్జరాం, నర్సింలు, లక్ష్మణ్, మూతాబీర్, ఏసయ్యలు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న బుచ్చిరెడ్డి తదితరులు

కంది(సంగారెడ్డి): మండలంలోని ఆరుట్లలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. 17న ప్రారంభమై ఉత్సవాలు సోమవారం ముగిశాయి. హోమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ ప్రసన్నరాంరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ బుచ్చిరెడ్డి, కురుమయాదవ సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హనుమాన్ జయంతికి ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి దేవస్థానం అధ్యక్షుడు మనోహర్, కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ అంజిరెడ్డిని కలిసి 22న జరిగే హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ గుప్తా, విరూపాక్ష, కంకర్ శ్రీను, విజయ్, ప్రసాద్ రమేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు జాతర



బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని జాడీమల్కాపూర్ గ్రామంలో లక్ష్మమ్మ ఆలయానికి భక్తులు ఘనంగా బోనాలు తీశారు. సోమవారం గ్రామంలోని మహిళలు దుర్గాదేవి జాతర ఉత్సవాల్లో భాగంగా బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

వేగంగా సుందరీకరణ పనులు

- తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు
- గార్డెనింగ్, ప్రహరీ నిర్మాణం
- అభినందిస్తున్న ప్రజలు

జహీరాబాద్ టౌన్: చెట్లు, మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా తయారైన తహసీల్దార్ కార్యాలయం వద్ద సుందరీకరణ పనులు చేపడుతున్నారు. ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన కార్యాలయం అధికారుల నిర్లక్ష్యం కారణంగా వెలవెలబోతుంది. ఎండిపోయిన చెట్లు, మొక్కలు, రాలిన ఆకులను కూడా తొలగించేవారు కరువైయ్యారు. చెట్ల మధ్య పేరుకుపోయిన గడ్డిని కూడా శుభ్రం చేయకపోవడంతో ఆటవీ ప్రాంతాన్ని తలపించింది. వర్షాలకు ప్రహరీగోడ కూలినా మరమ్మతులు చేపట్టం లేదు. దీంతో పశువులు కార్యాలయం ఆవరణలోకి వస్తున్నాయి. ఇటీవల జహీరాబాద్‌కు బదిలీపై వచ్చిన తహసీల్దార్ దశరథ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. కార్యాలయం ప్రాంతంలో సుందరీకరణ పనులను ప్రారంభించారు.

తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో విశాలమైన స్థలం ఉంది. గతంలో పనిచేసిన తహసీల్దార్లు ఇతర అధికారులు పచ్చదనంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఖాళీ స్థలంలో మొక్కలు నాటి క్రమం తప్పకుండా నీరు అందిస్తూ కాపాడుకుంటూ వచ్చారు. ఎప్పటికప్పుడు గడ్డి, చెత్త చెదారం తొలగించడంతో కార్యాలయం పచ్చదనంతో కళకళలాడేది. రెండు సంవత్సరాల నుంచి అధికారులు చెట్లు, మొక్కల సంరక్షణపై శ్రద్ధ వహించడం మానేశారు. దీంతో కార్యాలయం కళావిహీనంగా తయారైంది.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న గార్డెనింగ్ పనులు



పిచ్చి మొక్కల తొలగింపు

శరవేగంగా అభివృద్ధి పనులు

కొత్తగా వచ్చిన తహసీల్దార్ దశరథ్ సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. కూలిపోయిన ప్రహరీ గోడలకు మరమ్మతులు చేయించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు గార్డెనింగ్ పనులు చేయిస్తున్నారు. చెత్త చెదారాన్ని పూర్తిగా తొలగించి శుభ్రం చేయించారు. దీంతో తహసీల్దార్ కార్యాలయానికి పునఃవైభవం వచ్చినట్లు అనిపిస్తుంది. తహసీల్దార్ చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి ప్రజలు అభినందిస్తున్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత తప్పనిసరి

పీఆర్‌ఎస్‌ఈ జగదీశ్వర్



బీటీరోడ్డు పనులను పరిశీలిస్తున్న జగదీశ్వర్

కంది(సంగారెడ్డి): రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా చూడాలని పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జగదీశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కంది మండలంలోని ఛిమ్నపూర్ నుంచి ఛిమ్నపూర్ తండా వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.1.34 కోట్లతో 1.10 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని వెల్లడించారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈ దీపక్‌కుమార్, ఏఈలు శ్రీనాథ్‌రెడ్డి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లోకి మురికి నీరు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో దుకాణాల్లోకి మురికి నీరు చేరింది. దీంతో వ్యాపారులు దుకాణాలకు తాళం వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో అమరావతి లాడ్జి వద్ద మురికి కాలువలు చెత్తతో నిండిపోయాయి. మురికినీరు ముందుకు వెళ్లని కారణంగా లోతట్టు ప్రాంతంలో ఉన్న దుకాణాల్లోకి నీరు చేరింది. షాపుల ఎదుట నీరు నిలవడంతో వ్యాపారులు దుకాణాలను ఓపెన్ చేయలేకపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగించి మురికి నీరు ముందుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.



దుకాణాల ఎదుట నిలిచిన మురికినీరు

సమాజానికి విద్యార్థులే మూల స్తంభాలు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నారాయణఖేడ్: సమాజ భవిష్యత్‌కు విద్యార్థులే మూలస్తంభాలని అఖిలభారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ అన్నారు. ఖేడ్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో సంస్కార సాధనావర్గ సమారోప్ పేరిట 21 రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం సోమవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణతో పెంచాలన్నారు. శిశు నుంచి 10వతరగతి విద్యార్థులకు వేసవిలో భారత సంస్కృతి, సంప్రదాయాలు, నీతిపద్యాలు, శ్లోకాలు, క్రీడలు, కళాత్మక విషయాలైన చిత్రలేఖనం, లీఫోర్ట్, శాస్త్రీయ నృత్యం, అభినయ గేయాలు, యోగాచాప్, డంబుల్స్, కర్రసాము, కోలాటం, చెక్కభజనలో శిక్షణ నివ్వడం అభినందనీయమన్నారు. శిక్షణనిచ్చిన స్వప్న, గుండుశివకుమార్, విద్యార్థులకు క్రీడాపరికరాలను అందజేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌ను సన్మానించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. పాఠశాల కమిటీ బాధ్యులు సాంబయ్య, నారాయణ, వీరేశలింగం, వెంకటరమణారెడ్డి, డా.అర్థం చంద్రశేఖర్, శివరాజ్, డా.రాజయ్య, వీరారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న మూడ్‌కిషన్‌సింగ్ తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం చందర్‌నాయక్ తండాలో భవాని సమేత సేవాలాల్ మహరాజ్ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలు ఊరేగించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్, ఇరక్‌పల్లికు చెందిన దేవిదాస్ మహరాజ్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. నైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్ ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలి

కంది(సంగారెడ్డి): రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. సోమవారం కందిలో రోడ్డు విస్తరణలో భాగంగా ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న వారితో సమావేమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆరులైన్ల రోడ్డు నిర్మాణం జరుగుతున్నందునా రోడ్డు పక్కన ఉన్న ఇళ్లు, దుకాణాలు, స్థలాలు కొందరు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఇళ్ల యజమానులు మాట్లాడుతూ స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న తమకు పరిహారం ఇప్పించాలని కోరారు. రహదారుల చట్ట ప్రకారం డివైడర్ నుంచి రెండు వైపులా 100 ఫీట్ల వరకు ఎలాంటి పరిహారం వచ్చే అవకాశం లేదని ఎంపీడీఓ స్పష్టం చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు కట్టడాలకు సంబంధించిన పత్రాలను తమ కార్యాలయంలో అందజేస్తే వాటిని పరిశీలించి పరిహారం కోసం ఉన్నతాధికారులకు పంపుతామని ఎంపీడీఓ వివరించారు. సమావేశంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, కంది ఈఓ కవిత, నేషనల్ హైవే అధికారి చాంద్ పాషా పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి ఏడు రోజులు జైలు

జిన్నారం (పటాన్‌చెరు): మద్యం మత్తులో ఓ వ్యక్తి విధులు నిర్వహిస్తున్న పోలీసులను దుర్భాషలాడిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భరత్ భూషణ్ కథనం ప్రకారం.. 17న గుమ్మడిదల జాతీయ రహదారిపై పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన నరేందర్‌గౌడ్ (రాజుగౌడ్) అనే వ్యక్తిని తనిఖీ చేయడంతో మద్యం మత్తులో పోలీసులతో గొడవకు దిగాడు. నన్నే ఆపుతారా అంటూ దుర్భాషలాడాడు. దీంతో కేసు నమోదు చేసి సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఏడు రోజులు జైలు శిక్ష విధించారు.

ఎనిమిది మందికి జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి సంగారెడ్డి పాత బస్టాండ్, జాతీయ రహదారి, పోతిరెడ్డి పల్లి చౌరస్తా , బైపాస్‌లోని గుర్రపుబొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం జిల్లా కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒకరికి రూ. 2000, ఆరుగురికి రూ. 1500, మరోకరికి రూ. 1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

30మందికి..

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 30 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పరచగా ఇద్దరికి రూ.1500, 22 మందికి రూ.1000, ఆరుగురికి రూ.500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నూతన సంఘం ఎన్నిక

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని నాలుగవ తరగతి ఉద్యోగుల జిల్లా నూతన కార్యవర్గాన్ని టీఎన్జీఓ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా పండరి, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ మసూద్, మరో 13 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం వీరికి టీఎన్జీఓ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు.

అసైన్డ్ భూములను కాపాడాలని ఫిర్యాదు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని నగరవాసులు సోమవారం జిల్లా ఉన్నతాధికారులను కలిసి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నగరపరిధిలోని ఆలీనగర్ తెలంగాణ కాలనీ సర్వే నంబర్ 27, 10ల్లో కొంతమంది రియల్ వ్యాపారులు ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో కబ్జాకు పాల్పడుతూ వెంచర్ల పేరిట ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని అధికారులకు విన్నవించారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ అసైన్డ్ భూములను అక్రమార్కుల నుంచి కాపాడాలని గ్రామస్తులు ఉన్నతాధికారులను కోరారు. అలాగే, కాజిపల్లి గ్రామం సర్వే నంబర్ 180, 181, 182ల్లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ అన్నారు. ఈ సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని కాపాడి నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు.

ఘనంగా బీరప్ప కల్యాణోత్సవం

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో బీరప్ప, కామారతిల కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కురుమ సంప్రదాయబద్ధంగా ఈ ఉత్సవాలు జరుపుకొంటున్నారు. కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని చల్లగిద్ద తండాలో భవాని మాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. వెంకటాపూర్ చౌరస్తాలోని భక్త మార్కండేయ ఆలయంలో చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక అభిషేకం, హారతి, పుష్పార్చన, అన్నప్రసాద వితరణ చేపట్టారు. అబ్బెందకు చెందిన బాయిని సుశీల, నాగన్న కుటుంబ సభ్యులు ఆలయానికి హుండీని బహూకరించారు. సత్తెగామకు చెందిన భోగ గణేష్ 50 స్టీలు ప్లేట్లను వితరణ చేశారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఆలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ పరిధిలో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనచారి వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు వివరించారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ.60లక్షల సొంత నిధులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్‌చైర్మన్ రాములు గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

- రూ.3.35 కోట్లతో అంచనాలు
- 24 దుకాణాల సముదాయం నిర్మించేందుకు నిర్ణయం

జహీరాబాద్: పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా దుకాణాల సముదాయాన్ని నిర్మించేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రతిపాదించారు. ఏడాది క్రితం ప్రతిపాదించినా పలు మార్పులతో తాజాగా ప్రతిపాదనలు పంపారు. యార్డు మధ్యలో ఉన్న రెండు గోడౌన్‌లు శిథిలంగా మారడంతో వాటిని కూల్చివేసి ఎల్ ఆకారంలో దుకాణాల సముదాయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందుకు రూ.3.35 కోట్లు కావాల్సి వస్తుందని అంచనా వేశారు. ఈ నిధులతో 24 దుకాణాల సముదాయాన్ని నిర్మించేందుకు నిర్ణయించారు. ప్రస్తుతం యార్డు చుట్టు ఉన్న దుకాణాలన్నీ ప్రైవేటు వ్యక్తులకు చెందినవే. రహదారి పక్కన ఉన్న చిన్న దుకాణాలను వ్యాపారులకు అద్దెలకు ఇచ్చారు. యార్డులో కొత్తగా దుకాణాల సముదాయాన్ని నిర్మించడం వల్ల కమీషన్ ఏజెంట్లకు అద్దెలకు ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోనున్నారు. అంతేకాకుండా రైతులకు, వ్యాపారులకు సైతం సౌలభ్యం కానుంది. రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తీసుకువస్తే కొత్తగా నిర్మించనున్న దుకాణాల సముదాయం ముందు ఆరబెట్టుకునేందుకు కూడా అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ మార్కెట్ కార్యాలయానికి తూర్పు, దక్షిణం వైపున దుకాణాలను నిర్మించనున్నారు. వారం రోజుల క్రితం నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు మార్కెట్ కార్యదర్శి ఎ.చంద్రశేఖర్ పేర్కొన్నారు. నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు.



జహీరాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్

సామాజిక సేవతో గుర్తింపు



సర్టిఫికెట్‌లను అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో పాల్గొని పదిమందికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో మాజీ కౌన్సిలర్ పావని ఆధ్వర్యంలో శ్రీశక్తి మహిళా సంఘం ద్వారా మహిళలకు, చిన్నారులకు నిర్వహించిన వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా పాల్గొన్నారు.

మార్డి పెద్దచెరువు కబ్జాపై విచారణ

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డి పెద్ద చెరువు కబ్జాపై తహసీల్దార్ శివశ్రీనివాస్ సోమవారం విచారణ చేపట్టారు. నీటిపారుదల శాఖ ఏఈ అలేఖ్యరెడ్డితో కలిసి చెరువును పరిశీలించారు. పెద్దచెరువులో జేసీబీతో అడ్డుకట్టలు వేసి కబ్జా చేశారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కబ్జా చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. పట్టా భూమిని సాగు చేసేందుకు గెట్లు వేసే పనులు చేసినట్లు సంబంధిత రైతు వాదిస్తున్నారు. గ్రామస్తులు, రైతు మధ్య వివాదం చోటు చేసుకుంది. చెరువు కబ్జా జరిగిన విషయమై పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. కబ్జా చేసినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



కబ్జాప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

సంక్షిప్త వార్తలు

◆ ఉన్నత చదువులు చదవాలి

సంగారెడ్డి టౌన్ : విద్యార్థులు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో స్థిరపడాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత నాగ ఫణి శర్మ అన్నారు. సోమవారం సంగారెడ్డి పట్టణంలోని సీబీఎస్సీ పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనపరిచిన పయనీర్స్ విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం స్వరూప్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఇమ్రానా, టీచర్లు భాగ్యలక్ష్మి, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

◆ నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి కుమారస్వామి పేర్కొన్నారు. నేటి నుంచి మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలకు చెందిన 70 మంది ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్‌పై ఐదురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కంగ్టి(నారాయణఖేడ్): విద్యుత్ సమస్యల పరిష్కారానికి మంగళవారం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసినట్లు కంగ్టి ట్రాన్స్‌కో ఏఈ శోభరాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోగిపేట్ డివిజన్ పరిధిలోని అన్నసాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉ.10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలన్నారు. కంగ్టి, మనూర్, నాగల్‌గిద్ద మండలాల పరిధిలోని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

◆ కరపత్రాల పంపిణీ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ సమీపంలో హుగ్గెల్లి చౌరస్తాలో ప్రతిష్ఠించిన మహాత్మా విశ్వగురువు బసవేశ్వరుడి విగ్రహాన్ని ఈ నెల 23న సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు జహీరాబాద్ లింగాయత్ సమాజ్ నాయకులు బసవ భక్తులు సోమవారం పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఇళ్లు, వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ నెల 23న సీఎం మధ్యాహ్నం 2 గంటలకు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని, పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు.

◆ హత్నూర ఎస్సైగా శ్రీధర్ రెడ్డి

హత్నూర,(సంగారెడ్డి): హత్నూర నూతన ఎస్‌ఐగా శ్రీధర్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన సుభాష్ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌కు బదిలీ అయ్యారు. వికారాబాద్ జిల్లా పెద్దెముల్ ఎస్సై శ్రీధర్‌రెడ్డి బదిలీపై ఇక్కడి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. గ్రామాల్లో కొత్త వారు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

